క్లుప్తంగా

ఖండవల్లి సొసైటీలో విచారణ



సొసైటీలో విచారణ నిర్వహిస్తున్న డీసీఓ జగన్నాథరెడ్డి

పెరవలి: ఖండవల్లి కో ఆపరేటివ్ సొసైటీలో అక్రమాలు జరిగాయని ఆ గ్రామానికి చెందిన కోటిపల్లి అయ్యప్ప కలెక్టర్‌కు గ్రీవెన్స్‌లో ఇచ్చిన ఫిర్యాదుపై జిల్లా అధికారులు శుక్రవారం విచారణ చేపట్టారు. తనను దూషించారంటూ అయ్యప్ప అందజేసిన సాక్ష్యాలతో విచారణ చేపట్టినట్టు జిల్లా కోఆపరేటివ్ అధికారి జగన్నాథరెడ్డి తెలిపారు. సొసైటీలో 2017–20 మధ్య కాలంలో ఫిర్యాదుదారు తీసుకున్న రుణాన్ని చెల్లించానని, సొసైటీ సిబ్బంది చెల్లించలేదని భిన్న వాదనలతో కోర్టులో దావా వేసుకున్నారని డీసీఓ తెలిపారు. విచారణలో వెల్లడైన అంశాలను కలెక్టర్‌కు నివేదిస్తామని ఆయన తెలిపారు. విచారణలో సొసైటీ కార్యదర్శి, ప్రత్యేక అధికారి, గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు.

‘మానవత’కు కార్యాలయం ఏర్పాటు



జనార్దనరావును సత్కరిస్తున్న సభ్యులు

తాళ్లపూడి: మండల మానవత సేవా సంస్థ కార్యాలయానికి స్థానిక శిరిడీసాయి ఆలయ ప్రాంగణం వద్ద ఒక గదిని కేటాయిస్తూ ఆ సంస్థ గౌరవ చైర్మన్ సింహాద్రి జనార్దనరావు చర్యలు తీసుకున్నారు. శుక్రవారం ఆ గదిని సంస్థ నిర్వహణకు అప్పగించారు. సంస్థ మండల అధ్యక్షుడు అంకెం సురేష్, జనార్దనరావు, కమిటీ సభ్యులు నూతన కార్యాలయాన్ని ప్రారంభించి అనంతరం జనార్దనరావును సత్కరించారు.

దళిత క్రిస్టియన్లను ఎస్సీలుగా గుర్తించాలి

నిడదవోలు: దళిత క్రిస్టియన్లను ఎస్సీలుగా గుర్తించాలని సీపీఎం నాయకులు శుక్రవారం ప్రకటనలో కోరారు. దళితులు క్రిస్టియన్ మతంలోకి మారిన క్షణంలో ఎస్సీ హోదా కోల్పోతారనే హైకోర్టు తీర్పుపై సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జువ్వల రాంబాబు అభ్యంతరం వ్యక్తం చేశారు. క్రిస్టియానిటీ కులాన్ని గుర్తించకపోయినా కులవివక్ష, అంటరానితనం, అవమానాలు, దాడులు జరుగుతూనే ఉన్నాయని అనేక నివేదికలు తెలియచేస్తున్నాయన్నారు. దళితులు ఎంత ఉన్నత స్థానంలోకి వెళ్లినా కుల వివక్ష తప్పడం లేదని, దానికి ఉదాహరణే రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ సామాజిక పోరాటం అన్నారు.

ఐసీడీఎస్ కార్యక్రమాలపై అవగాహన కల్పించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న సర్పంచ్ జ్యోతి

నల్లజర్ల: ఐసీడీఎస్ కార్యక్రమాలపై అంగన్‌వాడీ కార్యకర్తలు గ్రామాల్లో ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలని సర్పంచ్ పల్లి జ్యోతి సూచించారు. శుక్రవారం నుంచి జూన్ 10వ తేదీ వరకు ప్రతి మంగళ, శుక్రవారాలలో గ్రామస్థాయి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. శుక్రవారం నల్లజర్లలో అంబేడ్కర్ కమ్యూనిటీ హాలులో సర్పంచ్ అధ్యక్షతన అవగాహన కార్యక్రమం జరిగింది. సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి మాట్లాడుతూ కిశోరి వికాసం, కమిటీల ఏర్పాటు, పర్యవేక్షణ సమావేశాలు, బాల్య వివాహాల నిరోధం, జీవన నైపుణ్యాలు, ఆరోగ్యం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మహిళా సంరక్షణ కార్యదర్శి సౌజన్య, కార్యదర్శి గిరిజ, ఏఎన్ఎం రత్నకుమారి, డ్వాక్రా నుంచి శ్రీదేవి, గిరిజ, పద్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు హాజరయ్యారు.

వైభవంగా శంకరుల జయంతి

నిడదవోలు: హిందూ ధర్మ పరిరక్షణకు కృషి చేసిన జగద్గురు ఆదిశంకరాచార్యులు నిత్య స్ఫూర్తి ప్రదాత అని ఉపన్యాసకులు శ్రీకాకుళపు పురుషోత్తం కొనియాడారు. పట్టణంలోని గోలింగేశ్వరస్వామి ఆలయంలో ఆదిశంకరాచార్యుల మండపం వద్ద ఆయన జయంతిని శుక్రవారం నిర్వహించారు. ఆయన విగ్రహానికి పంచామృతాలతో అభిషేకాలు, పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు శ్రీకాకుళపు వెంకటేశ్వరరావు, కొల్లేపర నగేష్, డీవీఎస్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

భర్త అదృశ్యంపై కేసు నమోదు

కొవ్వూరు: ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిలో సిబ్బంది బంగారు భవానీకుమార్ గత నెల 27వ తేదీ నుంచి కనిపించడం లేదని అతని భార్య దుర్గా భవాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదైనట్టు పట్టణ ఏఎస్సై జీజీ ప్రకాష్ తెలిపారు. 27న ఆసుపత్రిలో డ్యూటీకి వెళ్లి తిరిగి రాత్రి పది గంటల సమయంలో మద్యం తాగి ఇంటి వచ్చి తనతో గొడవపడి బయటికి వెళ్లి మళ్లీ ఇంటికి తిరిగిరాలేదని ఆమె ఫిర్యాదు చేసినట్టు ఏఎస్సై తెలిపారు.



నల్లాకులవారిపాలెంలో నిరుపయోగంగా ఉన్న సంపద కేంద్రం



ఖండవల్లిలో సేకరించిన చెత్తను నక్కల కాలువ గట్టుపై వేస్తున్న దృశ్యం



అజ్జరంలో ఇళ్ల మధ్య పేరుకుపోయిన చెత్తా చెదారం

సంపద చెత్తపాలు!

- సంపద కేంద్రాలకు రూ.కోట్ల వ్యయం
- సిబ్బంది నిర్లక్ష్యంతో లక్ష్యం శూన్యం
- మౌలిక వసతులకు రూ. 1.67 కోట్లు
- 18 కేంద్రాల ఆదాయం రూ.24 వేలు



ముక్కామలలో నిరుపయోగంగా ఉన్న సంపద కేంద్రం

పెరవలి: రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం వేల కోట్లు ఖర్చు చేసి గ్రామాలను స్వచ్ఛ గ్రామాలుగా తీర్చి దిద్దటానికి అన్నీ అమర్చినా క్షేత్ర స్థాయిలో అధికారుల నిర్లక్ష్యం వల్ల ఆ ప్రయత్నాలన్నీ బూడదలో పోసిన పన్నీరవుతున్నాయి. గ్రామాలు పరిశుభ్రంగా ఉంటే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని నమ్మిన ప్రభుత్వం అందుకు అవసరమైన మౌలిక వసతులు కల్పించినా, అధికారులు కార్యచరణలో విఫలమవుతున్నారు.

నిరుపయోగంగా సంపద కేంద్రాలు

గ్రామాల్లో చెత్తను పోగుచేస్తున్నామని ఎక్కడా చెత్త లేకుండా చూస్తున్నాం అని చెప్తున్న పంచాయతీ అధికారులు సేకరించిన చెత్తను మాత్రం సంపద కేంద్రాల్లో వేయటం లేదు. మండలంలో రెండు మూడు గ్రామాలు తప్పించి మిగిలిన ఏ గ్రామంలోనూ సంపద కేంద్రాలను సరిగా వినియోగించక అవన్నీ అసాంఘిక కార్యక్రమాలకు నిలయమవుతున్నాయి.

దుర్గంధభరితంగా గ్రామాలు

గ్రామాల్లో ఎక్కడి చెత్త అక్కడ వదలిలేయడంతో చెత్తకుళ్లి దుర్గంధం వ్యాపిస్తోంది. పారిశుధ్య నిర్వహణ సరిగా లేక రోడ్లపై చెత్త పేరుకుపోయి ప్రయాణికులు, బాటసారులు, గృహస్తులు అవస్థలు పడుతున్నారు. రోగాల బారిన పడి తీవ్ర అస్వస్థతలకు గురై ఆసుపత్రుల పాలై ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఇలా..

మండలంలో 18 గ్రామాల్లో 18 సంపద కేంద్రాల షెడ్లు నిర్మించారు. వీటికి గ్రామ స్థాయిని బట్టి రూ.5 లక్షల నుంచి రూ.8 లక్షల వరకు వెరసి రూ.1.17 కోట్లు ఖర్చు చేశారు. అంతే కాకుండా ట్రైసైకిళ్లు ఒక్కొక్కటి రూ.31,400 చొప్పన 69 పంపిణీ చేయగా వీటి విలువ రూ.22.66 లక్షలు, 24 ఆటోలకి రూ.24 లక్షలు, డస్ట్ బీన్లు 588 పంపిణీ చేయగా వీటి విలువ రూ.3.58 లక్షలతో పారిశుధ్య నిర్వహణకు ప్రభుత్వం ఇప్పటి వరకు రూ.1.68 కోట్లు ఖర్చు చేసింది. ఇంత చేసినా ఇప్పటి వరకు కొన్ని గ్రామాల్లో వీటిని వినియోగంలోకి తీసుకురాలేదంటే అధికారుల నిర్లక్ష్యం ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.

ఆదాయం అంతంతే

స్థానిక ప్రజా ప్రతినిధుల కోసమో లేక ఉన్నతాధికారుల మెప్పు కోసమో తెలియదు కానీ మండలంలోని సంపద కేంద్రాల ద్వారా ఇప్పటి వరకు కేవలం రూ.24 వేల ఆదాయం మాత్రమే సంపాదించగలిగారు.

పంచాయతీలకు పెరిగిన సిబ్బంది

గత ప్రభుత్వాల కన్నా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఈ శాఖకు ఒక అధికారిని నియమించడంతో ఉద్యోగుల సంఖ్య గ్రామ స్థాయిలో బాగా పెరగటంతో పాటు పంచాయతీలకు వివిధ శాఖల పనుల ప్రమేయం తగ్గింది. పారిశుధ్యం మీద దృష్టి పెట్టాల్సిన కార్యదర్శులు వాటిని నిర్లక్ష్యం చేయడంతో ఆర్థికంగా పరిపుష్టం కాలేకపోతున్నాయి.

ఎక్కడికక్కడే చెత్త



గ్రామాల్లో చెత్తా చెదారం ఎక్కడిక్కడ పేరుకుపోతున్నది. అధికారులు, ప్రజా ప్రతినిధులు వచ్చినప్పుడు మాత్రమే గ్రామాలను శుభ్రంచేస్తున్నారు. ఇళ్ల దగ్గర చెత్తను సేకరించరు. ఒకవేళ సేకరించినా రోడ్లు లేక, కాలువ గట్లు పక్కన వేస్తున్నారు. దీని వలన ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సంపద కేంద్రాలు ఉన్నా చెత్త మాత్రం వేయటం లేదు.

– భట్టు మోహన్, ఉసులుమర్రు

ఎరువుల తయారీపై దృష్టి పెట్టాం



సంపద కేంద్రాల వద్ద ఎరువులు తయారు చేయటానికి అన్ని చర్యలు తీసుకుంటున్నాం. గ్రామాల్లో చెత్తను సేకరిస్తున్నాం. అన్ని గ్రామాల్లో చెత్తను సేకరించి ఎరువు తయారీపై దృష్టి సారిస్తాం. – సీహెచ్ వెంకట రమణ, ఈఓ పీఆర్డీ అండ్ ఇన్‌చార్జి ఎంపీడీఓ పెరవలి

జక్కంపూడి విజయలక్ష్మికి అభినందన



జక్కంపూడి విజయలక్ష్మిని అభినందిస్తున్న తాళ్లపూడి నాయకులు

తాళ్లపూడి: వైఎస్సార్ సీపీ అమలాపురం పార్లమెంటరీ పార్టీ పరిశీలకురాలిగా నియమితులైన జక్కంపూడి విజయలక్ష్మికి శుక్రవారం స్థానిక పార్టీ నాయకులు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. రాజమహేంద్రవరంలోని ఆమె ఇంటి వద్ద పార్టీ జిల్లా ప్రచార కమిటీ మాజీ అధ్యక్షుడు తోట రామకృష్ణ, జిల్లా యాక్టివ్ కార్యదర్శి ఒంబోలు పోశిబాబూ, మండల కాపు సంఘం అధ్యక్షుడు నామ ప్రకాశం ఆమెను కలసినవారిలో ఉన్నారు.

అవును.. వాళ్లు ఇష్టపడ్డారు



వివాహం చేసుకున్న ప్రసన్న కృష్ణ, నిక్షిత్ జైన్

నిడదవోలు: ప్రేమకు కులమతాలు అడ్డుకావని వారు నిరూపించారు. వివరాల్లోకి వెళితే చాగల్లు మండలం బ్రాహ్మణగూడేనికి చెందిన గారపాటి ప్రసన్న కృష్ణ, నిడదవోలుకు చెందిన నిక్షిత్ జైన్ రెండేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. పట్టణంలో ఆక్యుపంచర్ థెరపిస్టులుగా పనిచేస్తున్న వీరి ప్రేమను కులాలు వేరు కావడంతో వారి తల్లిదండ్రులు అంగీకరించలేదు. చేసేది లేక వారు సీపీఎం నాయకులు జువ్వల రాంబాబును ఆశ్రయించడంతో ఆయన వారికి శుక్రవారం సాంఘిక వివాహం జరిపించారు.

నూతన కమిటీల నాయకులకు అభినందన



మండల నాయకులను అభినందిస్తున్న యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా

చాగల్లు: వైఎస్సార్ సీపీ నూతన కమిటీల్లో పదవులు పొందిన మండల నాయకులు పార్టీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, పార్టీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజాలను పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు గండ్రోతు సురేంద్రకుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం రాజమహేంద్రవరంలో కలసి కృతిజ్ఞతలు తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులైన జుట్టా కొండలరావు (ఏడుకొండలు)తో పాటు మండల పార్టీ అధ్యక్షులు మట్టా వెంకట్రావులను సత్కరించారు. పార్టీ జిల్లా ఆర్‌టీఏ విభాగం అధ్యక్షులు ఇంటి వీర్రాజు, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి జాలెం వెంకట్రావు, చాగల్లు అధ్యక్షులు బొర్రా రజనీప్రసాద్, దొంగ రాజారావు లను అభినందించారు. కార్యక్రమంలో జిల్లా ప్రచార విభాగం అధ్యక్షులు తోట రామకృష్ణ, చెల్లింకుల దుర్గామల్లేశ్వరరావు, బొర్రా కృష్ణ , పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

తనుశ్రీకి ప్రతిభా పురస్కారం



తనుశ్రీని సత్కరిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ

దేవరపల్లి: పదో తగరతి పరీక్షా ఫలితాల్లో 582 మార్కులు సాధించి మండలంలో ప్రథమ స్థానంలో నిలచిన యర్నగూడెం బొల్లిన గంగరాజు జెడ్పీ హైస్కూలు విద్యార్థిని ఎం.తనుశ్రీని ఉమ్మడి పశ్చిమ గోదావరి జెడ్పీ చైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ ఘనంగా సత్కరించి ప్రతిభా పురస్కారం అందజేశారు. శుక్రవారం ఏలూరులోని జెడ్పీ కార్యాలయంలో ఆమెను సత్కరించి పురస్కారంతో పాటు రూ.10 వేలు నగదు ప్రోత్సాహకాన్ని అందజేసినట్టు హెచ్ఎం ఊబా చంద్రరావు తెలిపారు. కార్యక్రమంలో డీఈఓలు వెంకటలక్ష్మమ్మ, నారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ కెప్టెన్ల ఆందోళన



నల్లజర్లలో ఆందోళన చేస్తున్న తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ కెప్టెన్ రాజు

నల్లజర్ల: తల్లీ బిడ్డ ఎక్స్‌ప్రెస్‌లో పనిచేస్తున్న కెప్టెన్లు(డ్రైవర్లు) తమకు ఉద్యోగ భద్రత, కనీస వేతనం రూ.18 వేలు అందించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఆందోళనకు దిగారు. స్థానిక తల్లీబిడ్డ వాహన కెప్టెన్ రాజు మట్లాడుతూ సమయంతో నిమిత్తం లేకుండా మారుమూల ప్రాంతాలకు సేవలు అందిస్తున్నామని, తమ సేవలు గుర్తించి ప్రభుత్వం వేతనాలు పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. పెరిగిన నిత్యావసర సరుకుల ధరలతో జీవించడం కష్టంగా ఉందన్నారు. యాజమాన్యం వాటా పీఎఫ్, ఈఎస్ఐ యాజమాన్యమే చెల్లించాలని, చట్టప్రకారం వీక్లీ ఆఫ్, జాతీయ సెలవులు అమలు చేయాలని కోరారు. శుక్రవారం ఎక్కడి వాహనాలు అక్కడే నిలిపి ఆందోళన చేశామని, ప్రభుత్వం స్పందించకుంటే తమ ఆందోళన ఉధృతం చేస్తామని వివరించారు.

రూ.5.1 కోట్లతో రహదారుల మరమ్మతులు

నిడదవోలు: నియోజకవర్గంలో ఆర్అండ్‌బీ రహదారుల మరమ్మతులకు రూ.5.1 కోట్ల నాబార్డు నిధులు విడుదలైనట్లు రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీనిలో భాగంగా ఎర్రచెరువు–పి.వేమవరం 3.607 కిలోమీటర్ల రహదారికి రూ.1.26 కోట్లు, వద్దూరు –తీపర్రు 8.50 కిలోమీటర్ల రహదారికి రూ.3.24 కోట్లు, తేతలి – మునిపల్లి 0.40 కిలో మీటర్ల రహదారికి రూ.60 లక్షలు మంజూరైనట్లు దుర్గేష్ పేర్కొన్నారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోండి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈఓ ఉమామహేశ్వరరావు

గోపాలపురం: గ్రంథాలయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ ఆకుల ఉమామహేశ్వరరావు అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయం వద్ద శుక్రవారం విద్యార్థులకు నిర్వహిస్తున్న వేసవి శిబిరాన్ని ఆయన సందర్శించి మాట్లాడుతూ ఎంతో మంది విద్యావంతులు శాఖా గ్రంథాలయాలను ఉపయోగించుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించారని గుర్తుచేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఎస్‌కే హితయతుల్లా, సీఆర్పీ కొయ్య నాగరాజు, గ్రంథాలయ అధికారి వెజ్జు సత్యనారాయణ పాల్గొన్నారు.

పేస్లిప్ డౌన్‌లోడ్ కాక ఇబ్బందులు

నిడదవోలు: యాప్ ద్వారా పేస్లిప్‌లు డౌన్‌లోడ్ కాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామన్నారని పలువురు పెన్షనర్లు శుక్రవారం ట్రెజరీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. స్థానిక సబ్ ట్రెజరీ కార్యాలయాలన్నీ తనిఖీ చేయడానికి వచ్చిన జిల్లా ట్రెజరీ అధికారి ఎస్.సత్యనారాయణను రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం నిడదవోలు శాఖ ఆధ్వర్యంలో కలిసి వారి సమస్యలు వివరించారు. ఈ సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు బలగం అప్పారావు, ప్రధాన కార్యదర్శి కీర్తి ఆంజనేయులు, కోశాధికారి కె. కుమార్ తదితరులు పాల్గొన్నారు.

40 సెకన్లలో సప్తస్వరాలతో గిన్నిస్ రికార్డు

- ఘనత సాధించిన తులసీమణి
- 18 దేశాల నుంచి 1046 మంది హాజరు



గిన్నిస్ రికార్డు ధ్రువపత్రాన్ని అందుకుంటున్న తులసీమణి

దేవరపల్లి: మండలం యర్నగూడేనికి చెందిన నల్లం తులసీమణి ఎలక్ట్రానిక్ కీబోర్డుపై 40 సెకన్లలో సప్తస్వరాలను ప్లే చేసి గిన్నిస్ ప్రపంచ రికార్డు సాధించారు. విజయవాడకు చెందిన హల్లెల్ మ్యూజిక్ స్కూలు వ్యవస్థాపకుడు పాస్టర్ అగస్టిన్ దండంగి సారథ్యంలో 2024 డిసెంబరు ఒకటో తేదీన 18 దేశాల నుంచి ఒకేసారి 1046 మంది కళాకారులు పోటీల్లో పాల్గొన్నారు. నిర్వాహకులు 46 సెకన్ల కాల పరిమితి నిర్ణయించగా కళాకారులు కేవలం 40 సెకన్లలోనే సప్తస్వరాలను వాయించారు. వారందరికీ గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ ఎడ్యుకేటర్ రిచ్ స్టీవెన్ రిచర్డ్‌సన్ అవార్డు ప్రకటించారు. విజయవాడ మెట్రోపాలిటన్ మిషన్ చర్చిలో రికార్డు ధ్రువపత్రాన్ని, పతకాన్ని తులసీమణికి అందజేశారు. తన భర్త నాగేంద్రకుమార్ సహకారంతో ఈ ఘనత సాధించినట్టు తులసీమణి పేర్కొన్నారు. ఆమెను గ్రామస్తులు అభినందించారు.

బాలికలు విద్యకు ప్రాధాన్యమివ్వాలి



బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ అధికారులు

ఉండ్రాజవరం: బాలికలు విద్యకు ప్రాధాన్యం ఇవ్వాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి అన్నారు. బాల్య వివాహాల నిర్మూలన పర్యవేక్షణ కమిటీ, ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని తాడిపర్రుతో పాటు పలు గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించారు. అనంతరం బాల్య వివాహాల నిర్మూలన కోరుతూ ర్యాలీ చేశారు. మోర్తలో కిశోరి వికాసము, వేసవి తరగతుల నిర్వహణలో భాగంగా చిన్నారులకు ముఖ పరిచయాలు, వారి పేర్లు, వారి తల్లిదండ్రుల పేర్లు, వారు చదువుతున్న పాఠశాల, గ్రామం తదితర వివరాలు చెప్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పిల్లి ముసలయ్య, కమిటీ సభ్యులు నిమ్మన కృష్ణమూర్తి, మోటుపల్లి సూర్యకుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కిశోర బాలికలు జాగ్రత్తలు పాటించాలి

గోపాలపురం: కిశోర బాలికలు తగిన జాగ్రత్తలు పాటించాలని సీడీపీఓ కె.నాగలక్ష్మి అన్నారు. మండలంలోని వాదాలకుంటలో సర్పంచ్ జొన్నకూటి మనెమ్మ ఆధ్వర్యంలో బాలికలతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. సీడీపీఓ మాట్లాడుతూ యుక్త వయస్సులో ఆవేశపూరిత నిర్ణయాలు తీసుకోకూడదని అన్నారు. సర్పంచ్ మనెమ్మ మాట్లాడుతూ పిల్లల వయసులో వచ్చే మార్పులను తల్లితండ్రులు గమనిస్తూ తగిన సూచనలు సలహాలు ఇవ్వాలన్నారు. వీఆర్‌జే సేన అధ్యక్షుడు జొన్నకూడి మోహన్‌కుమార్, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు పంచాయతీ కార్యదర్శి కె చిన వెంకాయమ్మ పాల్గొన్నారు.

దళితుల అభివృద్ధికి కృషి



జేఏసీ సభ్యులను అభినందిస్తున్న పార్టీ నాయకులు

తాళ్లపూడి: వైఎస్సార్ సీపీలోని దళితులు తమ జాతి అభివృద్ధికి కృషి చేస్తారని ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు, నియోజకవర్గ పార్టీ ఎస్సీ సెల్ మాజీ కన్వీనర్ యాళ్ల బాబూరావు అన్నారు. శుక్రవారం పార్టీ మండల దళిత జేఏసీ ఏర్పాటు చేసి కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రక్కిలంకకు చెందిన పార్టీ ఎస్సీ నాయకుడు యాళ్ల బాబురావును జేఏసీ అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా అన్నదేవరపేటకు చెందిన నూతంగి సురేష్, కార్యదర్శిగా పిట్టా శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శిగా పైడిమెట్టకు చెందిన కొల్లి దుర్గారావు, కోశాధికారిగా సిర్రా గంగారావు, సంయుక్త కోశాధికారిగా పిట్టా రాంకీ, మహిళా అధ్యక్షురాలిగా పోలుమాటి సత్యవతి, ఉపాధ్యక్షురాలిగా ముప్పిడి దమయంతి, గౌరవ అధ్యక్షుడిగా ఎంపీపీ జొన్నకుటి పోసిరాజు, గజ్జరం ఎంపీటీసీ గుంటి చిన్నబ్బాయిలను నియమించారు. లీగల్ అడ్వైజర్లుగా వి.నందా, కవల నాగేశ్వరరావు, జి మల్లికార్జునరావులను ఎంపిక చేసారు. అన్ని గ్రామాల నుంచి ఇద్దరు చొప్పున మరో 23 మంది ని కార్యవర్గ సభ్యులు గా నియమించారు. కార్యక్రమంలో గూడా విజయరాజు, గండి రాంబాబు, బట్టు సుబ్బారావు, నవీన్, పలు గ్రామాలకు చెందిన దళిత నాయకులు, యువకులు హాజరయ్యారు.

ఈదురుగాలుల బీభత్సం

- అర్ధరాత్రి వేళ అకాల వర్షం
- విరిగిపడ్డ విద్యుత్ స్తంభాలు
- రోడ్డుపై కూలిన వృక్షాలు
- విద్యుత్ సరఫరాకు అంతరాయం
- తడిసిన ధాన్యం రాశులు, మిర్చి



నిడదవోలు-కంసాలిపాలెం రోడ్డుపై నేలవాలిన చెట్లు

దేవరపల్లి/నిడదవోలు రూరల్: అర్ధరాత్రి వేళ ఈదురుగాలులకు తోడు భారీ వర్షం కురవడంతో పలు గ్రామాల్లో వృక్షాలు నేలకొరగగా, విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు విరిగిపడ్డాయి. చెట్ల కొమ్మలు విరిగిపడి విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. రోడ్లపై ఆరబెట్టిన ధాన్యం రాశులు, మొక్కజొన్నలు తడిసి ముద్దయ్యాయి. గురువారం అర్ధరాత్రి 2 నుంచి 3 గంటల వరకు వీచిన ఈదురుగాలులకు ప్రజలు భీతిల్లి ఎగిరిపోతున్న వస్తువులను భద్రపరుచుకున్నారు. గుండుగొలను–కొవ్వూరు ప్రధాన రహదారిపై చెట్లు నేల కూలాయి. దుద్దుకూరు వద్ద వృక్షాలు, పడిపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఎనిమిది విద్యుత్ స్తంభాలు విరిగిపడి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. పలు ప్రాంతాల్లో విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. యుద్ధ ప్రాతిపదికన స్తంభాలు ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరా పునరుద్ధరించినట్టు ఏఈ చిలకా వెంకట్రావు తెలిపారు. యర్నగూడెం సెక్షన్ పరిధిలోని కురుకూరు వద్ద విద్యుత్ స్తంభం విరిగి పడింది. యాదవోలు వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పడిపోవడంతో సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఉదయం కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. గౌరీపట్నం, దుద్దుకూరు, యర్నగూడెం, కృష్ణంపాలెం గ్రామాల్లో రోడ్లపై ఆరబెట్టిన ధాన్యం రాశులు, మొక్కజొన్న పంట పాక్షికంగా తడిసిపోయిందని, ధాన్యం రాశులపై బరాకలు కప్పినప్పటికీ అడుగు భాగం నుంచి వర్షపు నీరు వెళ్లడం వల్ల పాక్షికంగా తడిసిందని, కళ్లాల్లో ఎండబెట్టిన ఎండుమిర్చి తడిసిపోయిందని, మామిడి కాయలు నేలరాలిపోయాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

రాకపోకలకు అంతరాయం

నిడదవోలు– కంసాలిపాలెం, నిడదవోలు– యర్నగూడెం ఆర్అండ్‌బీ రోడ్డుపై చెట్లు కూలిపోవడంతో రాకపోకలకు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పలు చోట్ల విద్యుత్ స్తంభాలు నేల కూలడంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. తిమ్మరాజుపాలెం, రావిమెట్ల, కాటకోటేశ్వరం, తాడిమళ్ల గ్రామాల్లో మధ్యాహ్నానికి విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు.



దుద్దుకూరులో కొత్త విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేస్తున్న సిబ్బంది



గౌరీపట్నం వద్ద తడిసిన ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతులు



గుండుగొలను-కొవ్వూరు ప్రధాన రహదారిపై పడిన వృక్షాలు